నమస్తే తెలంగాణ
జోగులాంబ గద్వాల వనపర్తి
5 | మహబూబ్‌నగర్, సోమవారం 31 మార్చి 2025 | JOGULAMBA GADWAL WANAPARTHY

## చివరికి కన్నీళ్లే మిగిలాయి..

వడ్డేపల్లి, మార్చి 30 : ఆర్డీఎస్, నెట్టంపాడు కాల్వల పరిధిలో సాగు చేసిన పంటలకు సాగునీరు అందక పంటలు ఎండిపోవడంతో రైతులు కన్నీరు పెడుతున్నారు. బీఆర్ఎస్ హయాంలో తుమ్మిళ్ల లిఫ్ట్ ఏర్పాటు చేసినప్పటికీ తుంగభద్ర నదిలో నీటి ప్రవాహం ఉన్నంత వరకు నీళ్లు వస్తాయి. రిజర్వాయర్లు నిర్మించి నీటిని అందిస్తామన్నా కాంగ్రెస్ ప్రభుత్వ వాగ్దానం నీటి మూటగానే మారడంతో ఆయా ఆయకట్టు పరిధిలో సాగు నీరందక రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. మండలం లోని రామాపురానికి చెందిన మద్దిలేటి అనే రైతు తన బోరులో నీళ్లు సరిపోతాయని పంట వేసుకున్నాడు. ఆర్డీస్ కాల్వల్లో నీళ్లు లేనందునా భూగర్భ జలాలు తగ్గినందున తన బోరులో నీళ్లు రాలేదు. పంట ఎండ కూడదని మూడు బోర్లు వేసినప్పటికీ చుక్కనీరు రాలేదు. పంటకు పెట్టిన పెట్టుబడి బోర్లు వేసేందుకు చేసిన రూ.లక్ష అప్పు ఎలా తీర్చాలని ఆవేదన చెందుతున్నాడు.


రామాపురంలో ఎండిపోయిన మొక్కజొన్నను చూపిస్తున్న రైతు మద్దిలేటి

## పొలానికి పోవాలన్పిస్తలేదు..

భూత్పూర్, మార్చి 30 : మండలంలోని మద్దిగట్ల గ్రామంలో ఇటీవల వడగండ్ల వానకు వరిపంట పూర్తిగా నష్టపోయింది. గ్రామానికి చెందిన నర్సింహారెడ్డి 13 ఎకరాలు వరి పంట సాగు చేశాడు. వడగండ్ల వానకు గింజలు మొత్తం రాలిపోయి పంట పూర్తిగా దెబ్బతిన్నది. దాదాపు రూ.4లక్షలు పెట్టుబడి పెట్టగా చేతికొచ్చిన పంట ఒక్క వానకు పూర్తిగా నష్టపోయినట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. పంట నష్టపోవడంతో ఆయన పొలం వైపు వెళదామంటే కూడా మనసొప్పడం లేదని అంటున్నాడు.


మద్దిగట్లలో వరిపంటను పరిశీలిస్తున్న రైతు నర్సింహారెడ్డి


నవాబ్‌పేట మండలం కాకర్జాలతండాలో ట్యాంకర్‌తో పంటకు నీరు పెడుతున్న శంకర్‌నాయక్

- సాగునీళ్లు లేక పంటలు ఎండుముఖం
- అడుగంటిన భూగర్భజలాలు
- నిలువునా మునిగిన రైతులు
- అప్పులు చేసి పెట్టుబడి
- ఆఖరుకు తిండి గింజలు సైతం రాని వైనం
- ఉమ్మడి జిల్లాలో ఆవేదన చెందుతున్న అన్నదాతలు
- పట్టించుకోని అధికారులు, సర్కారు

# ఆశలన్నీ.. ఇంకిపాయె

ఆరుగాలం కష్టించి పండించిన పంట కండ్లముందే ఎండిపోతుండగా రైతులు కన్నీరు పెడుతున్నారు. చేసిన కష్టం కండ్ల ముందే మట్టిపాలు కావడంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. వానకాలం పంటలు చేతికిరాకపోవడంతో కనీసం యాసంగిలో తిండిగింజలైనా పండించుకుందామంటే మొదటికే మోసమొచ్చింది. కాల్వల్లో, బోరుబావుల్లో పుష్కలంగా నీళ్లు ఉన్నాయనే భరోసాతో సంబురంగా సాగు చేయగా, చేతికొచ్చే సమయంలో చి'వరి'కి పంటలన్నీ ఎండిపోయాయి. ఉమ్మడి పాలమూరు జిల్లాలో వరి, మొక్కజొన్న పంటలు సాగునీరు లేకపోవడం, బోరుబావులు ఎండిపోవడంతో దిక్కుతోచని స్థితిలో రైతులు పడిపోయారు. కొందరు రైతులు ఎలాగైనా పంటలను కాపాడుకోవాలని బోర్లు వేయించినా ఫలితం లేకపోయింది. చివరికి అప్పులే మిగిలాయి. ఇక చేసేది లేక చాలా మంది రైతులు పంటలను పశువులకు మేతగా వదిలేశారు. ఇంత జరుగుతున్నా సర్కారు, అధికారులు పంటలను పరిశీలించకపోవడం, కనీసం భరోసా కల్పించకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

– నమస్తే నెట్‌వర్క్, మార్చి 30

## ఇంత గోస పడ్తమనుకోలే..

- సగం పంట కాపాడుకునేందుకు ట్యాంకర్‌తో నీరు కొడుతున్నా.
- కాకర్జాల తండా రైతు ముడావత్ శంకర్‌నాయక్


బోరులో నీళ్లు రాకపోవడంతో ఎండిపోయిన వరి

నవాబ్‌పేట, మార్చి 30 : వరి పంట పండించేందుకు ఇంత గోస పడ్తమని కలలో కూడా అనుకోలే.. ఏమి కరువొచ్చినేమో.. తలుసుకుంటేనే భయమేస్తోంది. నాటిన మూడెకరాల్లో సగం ఎండిపోయింది.. మిగతా సగం పంటనైనా కాపాడుకుందామని వాటర్ ట్యాంకర్‌తో నీరు పెడుతున్నా నంటూ.. నవాబ్‌పేట మండలం కాకర్జాల తండాకు చెందిన గిరిజన రైతు ముడావత్ శంకర్‌నాయక్ తన మనసులోని బాధను వెళ్లగక్కాడు. ఇందుకు సంబంధించిన వివరాలోకి వెళ్తే.. కాకర్జాల తండాకు చెందిన శంకర్‌నాయక్ తనకున్న ఎకరాల పొలం తోపాటు తన పక్క పొలం రైతుతో మాట్లాడుకొని మరో.. రెండు ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకొని వరి నాటు వేశాడు. అతడి సొంత పొలంలో ఉన్న బోరులో పుష్కలంగా నీరు ఉండడంతో మూడెకరాలు సాగు చేశాడు. తీరా చూస్తే తీవ్ర ఎండలకు భూగర్భ జలాలు అడుగంటి అతడి బోరులో నుంచి నీరు రావడం నిలిచిపోయింది. గత 20 రోజుల నుంచి అతడి బోరులో చుక్క నీరు కూడా రావడం లేదు. ఈ క్రమంలోనే ఎకరన్నరలో పంట పూర్తిగా ఎండి పోయింది. ప్రస్తుతం ఉన్న సగం పంటనైనా కాపాడుకోవాలనే ఉద్దేశంతో ట్యాంకర్‌ను కిరాయికి తీసుకొన్ని వేరే రైతులతో నీరు అడుక్కొని తన పొలానికి తీసుకెళ్లి నీరు పెడుతున్నాడు. నీరు లేక పోవడం, కరెంట్ లోఓల్టేజీ సమస్యతో ఉన్న సగం కూడా పండుతుందో.. లేక ఎండుతుందో తెలియని పరిస్థితి నెల కొన్నది. ఈ విషయమై రైతు శంకర్‌నాయక్‌ను 'నమస్తే తెలంగాణ' పలకరించగా.. తన మనసులోని బాధను వెళ్లగక్కాడు. గత పదేండ్లు పుష్కలంగా పంటలు పండించుకున్నాం. అదే ధ్యాసలో మళ్లీ నాటు వేశా, కానీ ఇంత ఘోరమైన పరిస్థితి వస్తదనుకోలే. పంట సాగుకు సుమారుగా రూ.90 వేలు పెట్టుబడి పెట్టా. భూమి యజమానికి కౌలు ఎలా కట్టాలో తెలుస్తలేదు...అంటూ ఎండిపోయిన పంటను, నీరు పడుతున్న ట్యాంకర్‌ను, వట్టి పోయిన తన బోరును చూయిస్తూ కంటతడి పెట్టాడు.

## అడుగంటిన భూగర్భ జలాలు

- ఎండుతున్న పంటలు
- ఆందోళనలో అన్నదాతలు

ధన్వాడ, మార్చి 30 : భూగర్భ జాలాలు అడుగంటుతుండడంతో మండలం లోని అనేక గ్రామాల్లో చేతికొచ్చిన వరి పంటలు ఎండుతున్నాయి. దీంతో రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలం లోని మంత్రోనిపల్లి గ్రామానికి చెందిన రైతు రాంచంద్రయ్య, చిన్న నర్సిములు తమకున్న మూడు ఎకరాల్లో వరి పంట సాగు చేసుకున్నారు. మరో 15 రోజుల్లో పంట చేతికొస్తుందని సంబురపడిన రైతుల గుండెపై నీళ్లు చల్లినట్లు బోర్లలో నీరు ఇంకిపోవడంతో సదరు రైతులు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. పంటకు పెట్టుబడిగా ఎకరాకు రూ.30 వేలు పెట్టడంతో పాటు బోర్లు వేయానికి సుమారు రూ.2లక్షలు ఖర్చు చేసినా చుక్క నీరు పడలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


నీళ్లు పడకపోవడంతో వృథాగా ఉన్న బోరు

## ఈద్ ముబారక్


రంజాన్ వేడుకలకు ముస్తాబైన మహబూబ్‌నగర్‌లోని మదీన మసీదు

- నేడు రంజాన్
- ముస్తాబైన ఈద్గాలు

జడ్చర్లటౌన్, మార్చి 30: ముస్లింలు పవిత్రంగా జరుపుకొనే పండుగల్లో రంజాన్ అత్యంత పవిత్రమైనది. ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం 9వ నెల రంజాన్ మాసం ముగిసి ఆకాశంలో నెల వంక దర్శన మివ్వగానే షవ్వాల్ నెల ప్రారంభమవుతుంది. షవ్వాల్ మొదటి రోజున ముస్లింలు రంజాన్ (ఈదుల్ ఫితర్) పండుగను జరుపుకొంటారు. రంజాన్ పండుగ సందర్భంగా ముందస్తుగా ఈద్గాలను ముస్తాబు చేసి కొత్త దుస్తులు ధరించి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. ప్రార్థనల అనంతరం ఒకరి నొకరూ ఆలింగనం చేసుకొంటూ ఈద్ ఉల్ ఫితర్ శుభాకాంక్షలు తెలియజేసుకుంటారు. ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం తొమ్మిదవ నెల రంజాన్ మాసం లోనే పవిత్ర గ్రంథం ఖురాన్ అవతరించిడినందున ముస్లింలు ప్రత్యేకంగా నెల రోజుల పాటుదైవచింతనలోనే గడుపుతారు. భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు చేపట్టంతో పవిత్ర గ్రంథం ఖురాన్‌ను పఠనం చేస్తూ, రంజాన్ నెలలో ప్రతిరోజు తెల్లవారు జాము నుంచి సూర్యాస్తమయం వరకు కఠోర మైన ఉపవాస దీక్షలు చేపడతారు. రాత్రిళ్లూ మసీదులకు వెళ్లి తరావిహ్ ప్రార్థనలు చేస్తారు. రంజాన్ నెలలో 27వ రోజు రాత్రి ప్రత్యేకంగా షబ్‌ఖదర్‌ను జరుపుకొంటారు. ఆ రోజు రాత్రంతా ప్రత్యేక ప్రార్థనలు చేస్తూ అల్లాహ్‌ను ఆరాధిస్తే పాపాల నుంచి విముక్తి కలగడంతో పాటు స్వర్గానికి చేరుతారని ముస్లింల నమ్మకం. రంజాన్ నెల అంతా పవిత్ర కార్యక్రమాల అనంతరం షవ్వాల నెల ఒంక కనిపించానే ముస్లింలు ఉపవాసదీక్షలను విరమించి మరుసటి రోజు ఈదుల్ ఫితర్ పండుగను జరుపుకొంటారు.

### రంజాన్ నెలలో జకాత్, ఫిత్రాదానం

రంజాన్ నెలలో జకాత్, ఫిత్రా దానాలు అత్యంత ప్రత్యేకత. ధనికులు తమ ఆస్తిలో నుంచి నిర్ణీత మొత్తాన్ని పేదలకు దానం చేయడాన్ని జకాత్ అంటారు. ఏడాది కాలంలో మిగిలిన తన సంపద నుంచి 30శాతం చొప్పున ధన, వస్తు, కనకాల రూపంలో రంజాన్ నెలలో జకాత్ పేరుతో నిరుపేదలకు దానాలు చేస్తుంటారు. పేదలకు ఎంత మేర దానం చేస్తే అందుకు రెండింతలు సంపాదనను అల్లాహ్ సమకూరుస్తాడన్న నమ్మకం. అదే విధంగా రంజాన్ పర్వదినం రోజున ప్రత్యేక ప్రార్థనలకు వెళ్లే ముందుగా ఫిత్రా దానం చేస్తుంటారు. రంజాన్ ఉపవాస దీక్షలు విజయవంతం ముగిసినందుకు భగవంతుడికి కృతజ్ఞతగా పేదలకు ఫిత్రా దానం చేస్తారు. ఫిత్రా దానంలో 50 గ్రాములకు తక్కువ కాకుండా రెండు కిలోల గోధుమలు, ఆహార ధాన్యాలు, దానికి సమాన మైన డబ్బు రూపంలో పేదలకు అందజేస్తారు.

## ఆయిల్‌పాం మిల్లు నిర్మించొద్దు

- ఫ్యాక్టరీ నిర్మాణంతో నష్టాలే తప్పా.. లాభాలు శూన్యం
- ఎమ్మెల్యే జీఎమ్మార్‌కు వ్యతిరేకంగా ప్రజల నినాదాలు


సంకిరెడ్డిపల్లిలో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

కొత్తకోట, మార్చి 30: మండలం లోని సంకిరెడ్డిపల్లి తండా శివారులో కొటేటేన్ గుట్టపైన ఆయిల్ పాం ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టకూడదని చుట్టుపక్కల గ్రామస్తులు ఆదివారం ధర్నాకు పూనుకున్నారు. ఈ కొటేటేన్ గుట్ట పంచాయతీలో ఉందని.. ఇక్కడ ఆయిల్ పాం ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టకూడదని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ధర్నా ఉద్రిక్తమవడంతో పోలీసులు అక్కడికి చేరుకొని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు మాట్లాడుతూ.. గుట్ట మీద ఫ్యాక్టరీ నిర్మిస్తే సంకిరెడ్డిపల్లి చుట్టుపక్కల ఉన్న నాలుగు గ్రామాలైన సంకిరెడ్డిపల్లి కొత్తఊరు, సంకిరెడ్డిపల్లితండా, కానాయపల్లి కొత్తఊరు, కొత్తకోట మండల కేంద్రానికి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆరోపించారు. ఈ గుట్ట నాలుగు గ్రామాల్లో ఉండే గొర్లు, పశువుల కాపర్లకు నివాసంగా ఉందని, గొర్లు, పశువులను మేపడానికి తీసుకొస్తామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి గుట్టను ఇప్పుడు ఓ ప్రైవేట్ ఐటీ కంపెనీ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకొని ఆయిల్ పాం మిల్లును ప్రారంభించడానికి సిద్ధమవుతోందని ధర్నాకు దిగినట్లు పేర్కొన్నారు. అయితే ఈ నాలుగు గ్రామాల ప్రజలు ఆయిల్ పాం మిల్లుతో ఉపయోగం ఏం లేదని, ఈ మిల్లుతో చాలా వరకు నష్టాలే ఎక్కువగా ఉన్నాయని ఆరోపించారు. ధర్నాలో పాల్గొన్న వారంతా కాంగ్రెస్ కార్యకర్తలే కావడం విశేషం. ఫ్యాక్టరీని నిర్మించడానికి వీల్లేదని ధర్నాకు దిగిన కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్యే జీఎమ్మార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి గెలిపించుకున్నందుకు మా చెప్పు తీసుకొని మేమే కొట్టుకునే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. మేము ఓట్లు వేసి గెలిపించుకున్న నాయకులే ఇలా చేస్తే ప్రజల పరిస్థితి ఎవరు పట్టించుకుంటారని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై దౌర్జన్యాలు ఆపాలని ఎమ్మెల్యే జీఎమ్మార్‌కు విజ్ఞప్తి చేశారు.

## పెట్టుబడి లక్షయ్యింది..

హన్వాడ మార్చి 30 : మండలంలో కరువు పరిస్థితులు ఆందోళనకరంగా మారుతున్నాయి. భూగర్భజలాలు అడుగంటి పోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. రైతులు తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కిష్టంపల్లికి చెందిన గోపాల్‌రెడ్డి మూడెకరాల్లో వరి సాగు చేశాడు. బోరు బావుల్లో నీటిమట్టం తగ్గిపోవడంతో గొర్రెలకు మేత కోసం వారికి ఇవ్వడం జరిగింది. చేతికొచ్చే సమయంలో ఎండిపోవడం ఆందోళన కలిగిస్తోంది. సాగు చేసేందుకు రూ.లక్ష పెట్టుబడి అయ్యింది. మండలంలో ఏ గ్రామానికి వెళ్లినా ఇదే పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు ఏంచేయలో తెలియని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని కోరారు.


వరి ఎండిపోవడంతో గొర్రెల మేతకు వదిలేసిన గోపాల్‌రెడ్డి

## రంగాచార్యులకు ఉగాది పురస్కారం


ఉగాది పురస్కారం అందుకుంటున్న అర్చకుడు రంగాచార్యులు

గోపాల్‌పేట, మార్చి 30: ఉగాది సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీకోదండరామస్వామి ఆలయ అర్చకుడు రంగాచార్యులును ఆదివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఉగాది పురస్కారం అందజేసి, శాలువాతో సన్మానించింది. ఈ సందర్భంగా ఆయనకు అర్చక సంఘం సభ్యులు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. తమకు ఉగాది పురస్కారం రావడం ఆనందంగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు.

## చట్నీలో బల్లి పడి నలుగురికి అస్వస్థత

గద్వాల అర్బన్, మార్చి 30: బల్లి పడిన చట్నీ తిని నలుగురికి తీవ్ర అస్వస్థత అయిన ఘటన అదివారం జిల్లా కేంద్రంలో చోటు చేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని అహ్మద్ టిఫిన్ సెంటర్‌లో చిట్నీలో బల్లి పడింది.ఈ క్రమంలో బల్లి పడ్డ చిట్నీని టిఫిన్ సెంటర్‌కు వచ్చిన భోజన ప్రియులకు వడ్డించారు.ఈ క్రమంలో చిట్నీ తిన్న క్రమంలో అకస్మికంగా బల్లి శరీరం బయట పడింది. అనంతరం కొంత సమయానికి నలుగురు వ్యక్తులు తీవ్ర అస్వస్థతకు గురికాగా తక్షణమే ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స అందించారు. విషయం తెలుసుకున్న గద్వాల టౌన్ ఎస్సై కల్యాణ్‌కుమార్ దవాఖానకు వెళ్లి చట్నీ తిని అస్వస్థతకు గురైన వారి దగ్గర నుంచి ఆరా తీశారు. అనంతరం శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు టిఫిన్ సెంటర్ నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.


చికిత్స పొందుతున్న బాధితులు

## టీబీడ్యాం నుంచి రెండు టీఎంసీలు విడుదల

- ఎల్ఎల్‌సీ ఇండెంట్ నీళ్లు తుంగభద్రలోకి..

అయిజ, మార్చి 30: తుంగభద్ర జలాశయం నుంచి రెండు టీఎంసీల నీటిని విడుదల చేస్తున్నారు. ఏపీలోని కర్నూల్ జిల్లా ఎల్ఎల్‌సీ (లో లెవల్ కెనాల్) ఇండెంట్‌లోని రెండు టీఎంసీల నీటిని తుంగభద్ర నది ద్వారా ఆర్డీఎస్ ఆనకట్ట మీదుగా సుంకేసుల జలాశయానికి తరలించి నిల్వ చేసి వేసవి దాహార్తిని తీర్చేందుకు ఏపీ ప్రభుత్వం చర్యలు తీసుకున్నది. ఈ నెల 29 నుంచి ఏప్రిల్ 1వరకు రోజుకు 5వేల క్యూసెక్కులు, ఏప్రిల్ 2వ తేదీన 3,800 క్యూసెక్కుల నీటిని తుంగభద్ర నదిలోకి విడుదల చేస్తున్నట్లు టీబీ బోర్డు సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు. ఇప్పటికే ఆర్డీఎస్, కేసీ కెనాల్ ఇండెంట్ ముగియడంతో తుంగభద్ర నదీతీర ప్రాంతాల తోపాటుఆర్డీఎస్, కేసీ కెనాల్ ఆయకట్టు పరిధిలో పంటలు ఎండుతున్న వేళ నీటి విడుదలతో కొంతమేర ఉపశమనం కలుగుతుందని రైతులు పేర్కొంటున్నారు. కర్ణాటక, ఏపీలోని ఎల్ఎల్‌సీ ప్రధానకాల్వ మరమ్మతులు చేస్తున్న దృష్ట్యా ఎల్ఎల్‌సీ ఇండెంట్ నీళ్లు 2టీఎంసీల నీటిని తుంగభద్ర నదిలోకి విడుదల చేస్తున్నట్లు ఆర్డీఎస్ ఈఈ విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం టీబీ డ్యాం ద్వారా విడుదల చేసిన నీటిలో ఒక టీఎంసీ నీరు సుంకేసుల బ్యారేజీకి చేరే అవకాశం ఉందని ఆర్డీఎస్ ఈఈ పేర్కొన్నారు. తుంగభద్ర నది ఎండక ముందే టీబీ డ్యాం ద్వారా ఎల్ఎల్‌సీ నీటిని తుంగభద్ర నదిలోకి విడుదల చేసి ఉంటే పంటల ఎండకుండా ఉండేదని రైతులు పేర్కొంటున్నారు. ఏదేమైనా చివరి తడికైనా ఎల్ఎల్‌సీ నీరు ఆదుకుంటుందేమోనని రైతులు అభిప్రాయ పడుతున్నారు.